సాక్షి అనకాపల్లి


శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



వరికి 'సుడి' దెబ్బ

సుడిదోమ, తెల్లవీపు మచ్చల దోమలు వరి పంటపై దాడి చేస్తున్నాయి. బొంగరం పద్ధతిలో మందుల పిచికారీ మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

IIలో



ఆభరణాల నివేదిక సమర్పణ

సింహాచలం: సింహాచలేశుడి ఆభరణాలకు సంబంధించిన నివేదికను దేవదాయశాఖ కమిషనర్‌కి ఆర్‌జేసీ త్రినాథరావు సమర్పించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 35.0 నుంచి 35.3 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 27.5 నుంచి 27.8 డిగ్రీలు నమోదు కావచ్చన్నారు.

న్యూస్‌రీల్

25న ప్రాంతీయ డాక్ అదాలత్

యలమంచిలి రూరల్: తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలపై ఈనెల 25వ తేదీన 119వ డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు అనకాపల్లి డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటిండెంట్ సంజయ్ కుమార్ పాండా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ డాక్ అదాలత్‌ను విశాఖపట్నం ఎంవీపీ బస్ కాంప్లెక్స్ పక్కనున్న పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం వద్ద ఈ నెల 25వ తేదీ ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి జిల్లాల ప్రజలు ఈ నెల 22వ తేదీలోగా తమ ఫిర్యాదులను ఎన్వలప్ కవర్‌లో 'కేవీడీ సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం రీజియన్, విశాఖపట్నం 530017' అనే చిరునామాకు పంపించాలన్నారు. ఫిర్యాదులు పంపించేవారు ఎన్వలప్ కవర్‌పై '119వ డాక్ అదాలత్' అని రాయాలని ఆయన సూచించారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 13 అర్జీలు



ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఉద్యోగుల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో ఆమె ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల మూడో శుక్రవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌డేకి పలువురు ఉద్యోగులు హాజరై వారి సమస్యలపై అర్జీలు అందజేశారు. న్యాయమైన, పరిష్కరించడానికి అవకాశం గల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. మొత్తం 13 మంది ఉద్యోగులు వారి సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి సుబ్బలక్ష్మి, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి విజయ్ కుమార్, పీజీఆర్ఎస్ సెల్ సూపరింటెండెంట్ సురేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన మెడికల్ పోరు

- 'చలో మెడికల్ కాలేజ్'కి కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు తెలిపిన స్థానికులు, యువత, విద్యార్థులు
- మెడికల్ కళాశాలల పీపీపీ విధానం పెద్ద స్కాం
- పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేసేందుకేనని నేతల మండిపాటు
- పోలీసులు అడ్డుకున్నా తగ్గని వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కళాశాల ప్రాంగణంలో ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, తదితరులు

మాకవరపాలెం: వైద్య విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన గళం హోరెత్తింది. వైఎస్సార్ సీపీ పిలుపుతో పార్టీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమం ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను బలంగా వ్యక్తపరచింది. పీపీపీ విధానం పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేసేందుకేనని నేతలు మండిపడ్డారు. ఈ ఆందోళనలో పాల్గొనేందుకు జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, యువత వస్తుండగా రోడ్డుకు అడ్డుగా బారికేడ్లు పెట్టి పోలీసులు అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. మాకవరపాలెం మండలంలోని భీమబోయినపాలెంలో గల మెడికల్ కళాశాల ప్రాంతానికి చేరుకున్న నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను ముందుగా పోలీసులు అడ్డుకుని, నిరసనలు, ఆందోళనలకు అనుమతి లేదని, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని నోటీసులు జారీ చేశారు. 15 మందికి మించి వెళ్లకూడదనే ఆంక్షలు పెట్టారు. అయినా తగ్గేదేలే అంటూ.. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువత గళమెత్తింది. ఈ నిరసనలో అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి, ఉత్తరాంధ్ర జోన్-1 మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పి.వెంకటేష్, సీనియర్ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఈ ప్రాంత ప్రజలకు ద్రోహం చేయొద్దు

పీపీపీ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వమే మెడికల్ కాలేజీలను నిర్వహించాలంటూ ఇక్కడి ప్రాంగణంలో ప్లకార్డులతో ర్యాలీ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్‌గణేష్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి ఈ ప్రాంత ప్రజలకు ద్రోహం చేయొద్దని అన్నారు. గత ప్రభుత్వం వేలాది మంది ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు 630 పడకలతో మెడికల్ కళాశాలను మంజూరు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు, పేదలకు విద్య, వైద్యం అందకుండా చేయాలని చూస్తోందని ఆరోపించారు. పీపీపీ విధానాన్ని రద్దు చేసే వరకు తమ ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. శోభా హైమావతి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కళాశాల ఉండాలని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 17 కళాశాలలను మంజూరు చేశారన్నారు. వీటిలో 10 కాలేజీలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమన్నారు. కళ్లకు కట్టినట్టు భవనాలు కనిపిస్తున్న విషయాన్ని మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని శాంతియుతంగా భవనాల వద్దకు వస్తే పోలీసులతో కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. ఈర్లె అనురాధ మాట్లాడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావడం లేదని మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లి ఏం సాధిస్తున్నారని, పేదలకు మేలు చేసే పనులు ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ కక్షపూరిత రాజకీయాలు మానుకుని ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, స్థానిక మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చింతకాయల వరుణ్, పైలా శ్రీనివాసరావు, వివిధ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీ రోడ్డులో ఆందోళనకారులను బారికేడ్లతో అడ్డుకుంటున్న పోలీసులు



నిరసనలో పాల్గొన్న గణేష్, శోభా హైమావతి, ఈర్లె అనురాధ, యువజన నేత వెంకటేష్, తదితరులు

దసరాలోగా డీఏ బకాయిలు చెల్లించాలి

- కొత్త పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి
- యూటీఎఫ్ రణభేరి ముగింపు సభలో వక్తల డిమాండ్

IIలో

గుంతలు పూడ్చలేకపోతే కాంట్రాక్టు వదులుకోండి

బీఎన్ రోడ్డు కాంట్రాక్టర్‌కు స్పష్టం చేసిన ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజినీర్

రావికమతం: బిల్లులు చెల్లించకుంటే ఇకపై రోడ్డు అభివృద్ధి పనులు చేయలేమని బీఎన్ రోడ్డు కాంట్రాక్టర్ చెప్పడంతో.. గుంతలు పూడ్చలేకపోతే కాంట్రాక్టు వదులుకొమ్మని ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజినీరు విజయశ్రీ స్పష్టం చేశారు. రావికమతం మండలం గర్నికం–మేడివాడ గ్రామాల మధ్య బీఎన్ రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ భారీ గుంతల వల్ల వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను మండల ప్రజాప్రతినిధులు పలుమార్లు ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి వచ్చారు. దీనిపై స్పందించిన చీఫ్ ఇంజినీర్ విజయశ్రీ తక్షణమే గుంతలను పూడ్చించాలని కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రోడ్డు పనులు చేయలేమని కాంట్రాక్టర్ చెప్పారు. బిల్లులు చెల్లించకుంటే పనులు చేయలేమని కాంట్రాక్టర్ చెప్పడంతో అతడిపై చీఫ్ ఇంజినీర్ విజయశ్రీ మండిపడ్డారు. గుంతలు పూడ్చలేని పక్షంలో కాంట్రాక్ట్ రద్దు చేసుకోవాలని సూచించారు.

అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో చేపడుతున్న, నిర్మాణంలో ఉన్న పనులకు సుమారు రూ.130 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని చెప్పారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదలకు కృషి చేస్తామని చెప్పారు. అప్పటి వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని కాంట్రాక్టర్‌ను కోరామని తెలిపారు.



మేడివాడలో బీఎన్ రోడ్డును పరిశీలిస్తున్న ఆర్ అండ్‌బి చీఫ్ ఇంజినీర్ విజయశ్రీ

పునరావాస కాలనీకి తరలిరావాలి

నిర్వాసితులకు కలెక్టర్ సూచన

నక్కపల్లి: పరిశ్రమల కోసం ఏపీఐఐసీకి నివాస ప్రాంతాలను ఇచ్చిన నిర్వాసితులు ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కాలనీలకు తరలిరావాలని కలెక్టర్ విజయ కృష్ణన్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం ఆమె నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వేంపాడు, డీఎల్ పురం, రాజయ్యపేట, అమలాపురం గ్రామాలకు చెందిన నిర్వాసితులతో సమావేశమయ్యారు. 750 మందిని గుర్తించి వారికి పెద బోదిగల్లం వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించినట్టు చెప్పారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.8.98 లక్షలు ఇస్తున్నామని, ఇల్లు నిర్మించుకునే వారికి ఇసుక, సిమెంట్, ఐరన్ తక్కువ ధరకు ఇప్పిస్తామన్నారు. అలాగే కాలనీలో డ్రెయినేజీలు, రోడ్లు, తాగునీటి సరఫరా, విద్యుచ్ఛక్తి వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. నిర్వాసితుల్లో ఎంతమంది పునరావాస కాలనీకి రావడానికి సిద్ధంగా ఉన్నారనే వివరాలను తెలుసుకున్నారు. నిర్వాసితులందరూ ఇక్కడకు వచ్చేలా అధికారులు, నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి.వి.రమణ, తహసీల్దార్ మూర్తి, డీటీ నారాయణరావు, పలువురు నిర్వాసితులు పాల్గొన్నారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తిమిరాం వారపు సంతకు దసరా శోభ

- సంతకు భారీగా వచ్చిన పొట్టేళ్లు, మేకపోతులు
- అమాంతంగా పెరిగిన ధరలు
- నాటు కోళ్ల ధరలకు రెక్కలు

IIలో

బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేసే వరకూ

ఉద్యమం



శ్రీనివాసరావుకు సంప్రదాయపద్ధతిలో స్వాగతం పలికిన మత్స్యకారులు

- ఆరో రోజూ కొనసాగిన మత్స్యకారుల నిరశన దీక్ష
- పార్క్‌ను రద్దు చేయాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేస్తున్న నిరాహార దీక్ష ఆరోరోజు కొనసాగింది. బల్క్ డ్రగ్ పార్క్‌ను ప్రభుత్వం రద్దు చేసేవరకూ ఆందోళన విరమించే ప్రసక్తే లేదని, ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని మత్స్యకారులు తెలిపారు. ప్రాణాలకు తెగించి అయినా సరే ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. శుక్రవారం రాజయ్యపేటను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సందర్శించారు. నిరాహారదీక్షలో పాల్గొని, మత్స్యకారులకు సంఘీభావం తెలిపారు. ఐదురోజులుగా పోలీసులు ఏ విధంగా ఇబ్బంది పెట్టారు. ప్రభుత్వం ఏవిధంగా మోసం చేసి భూములు తీసుకుంది, హోం మంత్రి గతంలో ఇచ్చిన హామీలు, ఇప్పుడు చేసిన మోసం గురించి మత్స్యకారులు వివరించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోమూడు చోట్ల ఈ పార్క్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోమాత్రమే ఏర్పాటు చేస్తున్నారన్నారు. కాకినాడ జిల్లాలో ఏర్పాటు చేయబోతే అక్కడ ప్రజలు, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు వ్యతిరేకిస్తే ఉపసంహరించుకున్నారని తెలిపారు. అనకాపల్లి జిల్లా ప్రజలు అమాయకులు కాబట్టే నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఆరు రోజులుగా మత్స్యకారులు నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వం కనీసం స్పందించకపోగా చేస్తున్న దీక్షను పోలీసుల సాయంతో భగ్నం చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. మత్స్యకారుల ఉద్యమాన్ని రాష్ట్రస్థాయికి తీసుకెళ్తామన్నారు. మిగిలిన అన్ని ప్రాంతాల్లో ఉన్న మత్స్యకారులతో పాటు ప్రభావిత సామాజిక వర్గాలన్నింటినీ ఏకం చేస్తామని చెప్పారు. కూటమి నాయకులు ప్రతిపక్షంలో ఒకలా.. అధికారం చేతికి వచ్చేక మరోలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న హోం మంత్రి అనిత మాట తప్పారని చెప్పారు. పోలీసుల సాయంతో ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సీపీఎం ఈ ఉద్యమానికి అండగా నిలుస్తుందన్నారు. ప్రాణాలు తీసే పరిశ్రమలపట్ల మత్స్యకారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వమే ఈ బల్క్ డ్రగ్ పార్క్ నిర్మించడం మరీ దారుణమన్నారు. తక్షణమే ఈ పార్క్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కేసులకు భయపడకుండా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. రాజయ్యపేట వచ్చిన శ్రీనివాసరావుకు మత్స్యకారులు తమ సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. బల్క్ డ్రగ్‌పార్క్‌కు వ్యతిరేకంగా మత్స్యకారుడు రాసిన పాటల సీడీని శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు లోకనాథం, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు,జెడ్పీటీసీ కాసులమ్మ, మత్స్యకార నాయకులు ఎరిపిల్లినాగేశు, పిక్కి తాతీలు, మహేష్, సూరిబాబు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పోలవరం పనులు

- నెల రోజులుగా 7వ ప్యాకేజీ పనులకు బ్రేక్
- రూ.20 కోట్లకు పైగా బిల్లుల పెండింగ్
- సొంత రాష్ట్రాలకు వెళ్లిపోయిన ఇంజినీర్లు, కూలీలు
- కాంట్రాక్టు సంస్థ కార్యాలయం వద్ద కనిపించని వాహనాలు
- డిసెంబరులోగా పనులు పూర్తి డౌటే



నిలిచిపోయిన పోలవరం ఎడమ ప్రధాన కాల్వ పనులు

యలమంచిలి రూరల్: తమ ప్రభుత్వం పోలవరం ఎడమ ప్రధాన కాల్వ నిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తోందని,ఈ ఏడాది డిసెంబరు కల్లా పనులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పలుమార్లు చేసిన ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు పొంతన కుదరడంలేదు. ఇందుకు జిల్లాలో జరుగుతున్న పోలవరం ఎడమ ప్రధాన కాల్వ నిర్మాణ పనులే ఉదాహరణగా చెప్పొచ్చు. దార్లపూడి నుంచి తాళ్లపాలెం వరకు జరుగుతున్న 7వ ప్యాకేజీ పనులు నెలరోజులుగా నిలిచిపోయాయి.నిర్మాణ పనులు చేపడుతున్న కేసీఎల్ సంస్థకు రూ.20కోట్లకు పైగా బిల్లుల బకాయిలు కూటమి ప్రభుత్వం చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని ప్రకటనలు చేస్తున్నారే తప్ప పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థకు బిల్లులు చెల్లించడంలేదు.ఫలితంగా కాంట్రాక్టు సంస్థలు కూడా పనులు కొనసాగించలేని పరిస్థితి నెలకొంది.గత 7 నెలలుగా పోలవరం ఎడమ ప్రధాన కాల్వ 7వ ప్యాకేజీ పనులకు సంబంధించి చేస్తున్న పనుల బిల్లులు సుమారు రూ.20 కోట్లకు పైగా పేరుకుపోయాయి.ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి 7వ ప్యాకేజీ పనులు పట్టాలెక్కించిన కూటమి ప్రభుత్వం ఆరంభంలో పోలవరం ఎడమ కాల్వ పనులను త్వరితగతిన చేయిస్తున్నామంటూ ప్రకటనలు గుప్పించింది. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు సైతం జిల్లాలో 7వ ప్యాకేజీ పనులను పరిశీలించారు. బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తామని అధికార్లు చెప్పడంతో కాంట్రాక్టు సంస్థ బిహార్ సహా ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు,ఇంజినీర్లను రప్పించి స్ట్రక్చర్లు,అక్విడెక్టుల నిర్మాణ పనులను చేయించింది.పనులు పురోగతిలో ఉన్న సమయంలో కాంట్రాక్టు సంస్థకు బిల్లులు చెల్లింపును ప్రభుత్వం నిలిపివేసింది.సంస్థలో పనిచేసే ఇంజినీర్లు,కూలీలు,వాహనాల అద్దె, ఇతర నిర్వహణ ఖర్చులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడ పనిచేయడానికి వచ్చిన కూలీలు సొంతరాష్ట్రాలకు వెళ్లిపోయారు.అద్దెకు తెచ్చిన టిప్పర్లు, ఇతర వాహనాలను యజమానులు తీసుకెళ్లిపోయారు.క్షేత్రస్థాయిలో పని చేసే ఇంజినీర్లు,సిబ్బంది కూడా విధులకు సక్రమంగా హాజరుకావడంలేదు.ప్రస్తుతం కాంట్రాక్టు సంస్థ కార్యాలయం వద్ద రెండు, మూడు వాహనాలు మాత్రమే కనిపిస్తున్నాయి.వందమందికి పైగా కూలీలు ఉండాల్సిన చోట 10మంది వరకే కూలీలు కనిపిస్తున్నారు. పనులు చురుగ్గా జరిగేటప్పుడు ఏటికొప్పాక వద్ద కాంట్రాక్టు సంస్థ క్యాంపు కార్యాలయం వద్ద సందడిగా ఉండేది.పనులు నిలిపోవడంతో అక్కడ నిశ్శబ్ద వాతావరణం కనిపిస్తోంది.

> పోలవరం ఎడమ ప్రధాన కాల్వ 7వ ప్యాకేజీ పనులకు సంబంధించి కాంట్రాక్టు సంస్థకు రూ.20కోట్ల వరకు బిల్లుల చెల్లింపులు జరగాల్సి ఉంది.ఇటీవల కాల్వ నిర్మాణ పనులు నెమ్మదించాయి.వర్షాల కారణంగా కూడా పనులు చేపట్టడానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. 6ఏ ప్యాకేజీకి సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లింపులు ప్రారంభమయ్యాయి.7వ ప్యాకేజీ బిల్లులు కూడా త్వరలో చెల్లించే అవకాశం ఉంది. గడువులోగా పనులు పూర్తి చేయలేకపోతే మరోసారి గడువు పొడిగింపునకు కాంట్రాక్టు సంస్థ కోరవచ్చు.
>
> **పనులు నెమ్మదించాయి**
>
> – జి.రామకోటేశ్వరరావు, ఈఈ, పోలవరం ఎడమ ప్రధాన కాల్వ 6,7 ప్యాకేజీలు



పనులు నిలిచిపోవడంతో ఏటికొప్పాక కేసీఎల్ కార్యాలయం వద్ద నిలిపి ఉంచిన కొన్ని వాహనాలు

డిసెంబరుకు పూర్తి కావడం డౌటే?

జిల్లాలో పోలవరం ఎడమ ప్రధాన కాల్వ పనులు 6,7 ప్యాకేజీలుగా జరుగుతున్నాయి.వీటిలో రూ.331.73 కోట్లతో పాయకరావుపేట నుంచి దార్లపూడి వరకు సుమారు 25 కిలోమీటర్ల పొడవున 6ఏ ప్యాకేజీ పనులు బెంగళూరుకు చెందిన బీఎస్సార్ ఇన్‌ఫ్రా టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేస్తోంది.గత ఏడు నెలల్లో 6ఏ ప్యాకేజీ పనులు 18శాతం జరిగాయి.ఈ పనులకు సంబంధించిన ఇటీవల కొంత మొత్తం కాంట్రాక్టు సంస్థకు చెల్లించారు. ఇంకా రూ.25కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది.దార్లపూడి నుంచి తాళ్లపాలెం వరకు సుమారు 26 కిలోమీటర్ల 7వ ప్యాకేజీ పనులను రూ.304.98 కోట్లతో అహ్మదాబాద్‌కు చెందిన కేసీఎల్ జేసీసీ సంస్థ చేస్తోంది.7వ ప్యాకేజీలో కొంతమేర పనులు పూర్తయినప్పటికీ ప్యాకేజీలో ముఖ్యమైన ఏటికొప్పాక వద్ద అక్విడెక్టు నిర్మాణ పనులు, కాంక్రీటు స్ట్రక్చర్లతో పాటు తాళ్లపాలెం సమీపంలో కొంత భూసేకరణ జరగాల్సి వుంది.చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు దిక్కుతోచనిస్థితిలో నిత్యం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.6వ ప్యాకేజీ పనులు వచ్చే ఏడాది జనవరి,7వ ప్యాకేజీ పనులు ఈ ఏడాది డిసెంబరుకు పూర్తి చేయాలని కాల్వ పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థలకు ప్రభుత్వం గడువు పెట్టింది.సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిర్దేశించిన గడువులోగా జిల్లాలో పోలవరం ఎడమ ప్రధాన కాల్వ పనులు జరగడం సందేహమే.ఈ ప్రాంత ప్రజలకు జీవనాడిలాంటి పోలవరం పనులను త్వరితగతిన పూర్తి చేసి గోదావరి జలాలలను సాగు,తాగునీరు,పారిశ్రామిక అవసరాలకు అందించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది.కేంద్రం,రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి కాబట్టి పోలవరం ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా పనులు పూర్తయ్యేలా చూడాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.



దార్లపూడి వద్ద నిలిచిపోయిన పోలవరం 7వ ప్యాకేజీ అక్విడెక్టు పనులు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు మాకవరపాలెం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు రవి

మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం భీమిలి మున్సిపల్ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ఆరుగురు స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు డి.రవి, చంద్రదేవి తెలిపారు. సదరు విద్యార్థులను వారితోపాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

వివిధ స్టేషన్లలో 8 కేసులు నమోదు



నిందితుడితో ఎస్‌ఐ రామారావు

గొలుగొండ: గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని ఎస్‌ఐ రామారావు శుక్రవారం అరెస్టు చేశారు. గత నెలలో ఏజెన్సీ నుంచి కారు, బైక్‌లో 216 కిలోల గంజాయి అక్రమంగా తరలిస్తుండగా, ఏటిగైరంపేట వద్ద బుచ్చెయ్యపేటకు చెందిన చొప్పా నాగరాజు(38) అప్పట్లో తప్పించుకున్నాడు. అప్పటి నుంచి అతడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఎస్‌ఐ చాకచక్యంగా పట్టుకొని కోర్టుకు తరలించారు. అతడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 8 కేసులు నమోదు కాగా, బుచ్చెయ్యపేట స్టేషన్‌లో రౌడీ షీట్ ఓపెన్ చేశారు. నిందితుడిని పట్టుకున్న గొలుగొండ ఎస్‌ఐ రామారావు, సిబ్బందిని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ అభినందించారు.

వరికి 'సుడి' దెబ్బ

- పైరులో రసం పీల్చుతున్న సుడిదోమ, తెల్లవీపు మచ్చల దోమ
- శ్రీకాకుళం సన్నాలు, సాంబ మసూరిపై దాడి
- నివారణకు బొంగరం పద్ధతిలో మందుల పిచికారీ మేలు
- ఇంద్ర రకం వాడుతున్న రైతులు సేఫ్



వరి దుబ్బుల వద్ద ఆశించిన సుడిదోమ, తెల్లవీపు మచ్చల దోమల గుంపు

రాంబిల్లి(అచ్యుతాపురం): జిల్లాలో వరినాట్లు వేసి 20 నుంచి 30 రోజులు దాటింది. ప్రస్తుత వాతావరణ మార్పులతో వరి పైరులో సుడిదోమ, తెల్ల వీపు మచ్చల దోమల ఉధృతి అధికంగా ఉంది. ఈ దోమలు వరి దుబ్బుల ద్వారా రసం పీల్చడంతో పైరంతా ఎండిపోయినట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ ఇటీవల రాంబిల్లి మండలంతోపాటు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఆర్‌జీఎల్ - 2537(శ్రీకాకుళం సన్నాలు) రకానికి దోమల తీవ్రత అధికంగా ఉన్నట్లు గుర్తించారు. బీసీటీ 5204(సాంబమసూరి) రకానికి కొద్దిగానూ, ఎంటీయూ 1062(ఇంద్ర) రకానికి దోమల తాకిడి లేనట్లుగా గుర్తించారు. వరి పంటను ఆశించిన దోమలు, నివారణ మార్గాలు, జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు.

దోమల ఉధృతికి కారణాలు...

- అధిక తేమతో కూడిన పొడి వాతావరణం
- మోతాదుకు మించి ఎరువుల వాడకం
- దమ్ము సరిగ్గా చేయకపోవడం
- గట్లు శుభ్రం లేకపోవడం



రాంబిల్లి మండల పరిధిలో దుబ్బుల వరకూ ఉన్న నీటిమట్టంతో వరి పంట

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- ప్రతి రెండు మీటర్ల నాట్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు వదలాలి.
- దోమ నివారణకు మందు పిచికారీ చేసేటప్పుడు ముందుగా గట్టు చుట్టూ పిచికారీ చేసిన తర్వాత బొంగరం మాదిరిగా పొలంలో మందు పిచికారీ చేయాలి.
- పొలంలో నీటిని తీసివేసి సాయంత్రం సమయంలో మందు పిచికారీ చేయడం శ్రేయస్కరం
- పొలంలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు నీటిని తీసివేయాలి. అవకాశం ఉన్నంత వరకూ పొలాన్ని ఆరబెట్టాలి.
- సిఫారసు చేసిన మోతాదు మేరకే నత్రజని వాడాలి.
- కొన్ని రకాల మందుల పిచికారీ వల్ల దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున స్థానిక వ్యవసాయ అధికారుల సిఫారసు మేరకు వాటిని నియంత్రించాలి.

నివారణ ఇలా...

ప్రస్తుతం దోమల ఉధృతి అధికంగా ఉన్నందున వాటి ప్రభావం లేని పొలాల్లోనూ వేప నూనె పిచికారీ చేసుకోవాలి.

- దోమ ఉధృతి ప్రారంభ దశలో ఉన్నప్పుడు ఎసిఫేట్ 75 ఎస్‌పీ 250 గ్రాములు లేదా 300 గ్రాముల చొప్పున లేదా ఇమిడాక్లోప్రిడ్ తోపాటు ఎథిప్రోల్ 80 డబ్ల్యూజీ 50 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 17.8 శాతం ఎస్‌ఎల్ మందు 50 మిల్లీలీటర్లు లేదా బ్యుప్రొఫెజిన్ 25 శాతం ఎస్‌సీ 300-320 మిల్లీలీటర్లు చొప్పున ఏదో ఒక మందును ఎకరాకు చొప్పున పిచికారీ చేయాలి.
- దోమ ఉధృతి ఎక్కువగా ఉన్న మేరకు స్థానిక వ్యవసాయాధికారుల సూచనలతో తగిన మందులు పిచికారీ చేయాలి.
- పంట ప్రారంభ దశలో ఉన్నందున దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉన్న మేరకు ముందుగా తక్కువ ప్రభావం ఉన్న మందుల్ని, అప్పటికే తగ్గకపోతే నెల రోజుల తర్వాత అధిక ప్రభావం ఉన్న మందుల్ని స్థానిక వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పిచికారీ చేయాలి.
- నిర్దేశించిన మోతాదుకు మంచి మందును పిచికారీ చేస్తే మళ్లీ దోమల ఉధృతి పెరిగినప్పుడు నియంత్రించడం కష్టమవుతోంది.
- రెండో సారి మందును ఉపయోగించాల్సి వస్తే మొదటి సారి వాడిన మందును కాకుండా వేరొక మందను పిచికారీ చేయాలి.

హెటెరో గొడౌన్‌లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న యూఎస్ అధికారులు

నక్కపల్లి: మండలంలో వెదుళ్లపాలెం సమీపంలో నిర్వహిస్తున్న హెటెరో గోదాముల్లో యూఎస్ ఎఫ్‌డీఏ బృందాలు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశాయి. ఇక్కడ కంపెనీ వారు అద్దె గృహాన్ని తీసుకుని ట్రైనింగ్ ఇస్తున్నట్లు తెలిసింది. ఎటువంటి నేమ్ బోర్డు లేకుండా ఉన్న ఈ గోదామును, ట్రైనింగ్ సెంటరును ఢిల్లీ నుంచి వచ్చిన యూఎస్ ఎఫ్‌డీఏ బృందాలు పరిశీలించాయి. కొన్నేళ్ల క్రితం గోదాములను నిర్మించారు. అక్కడ కొన్ని ఔషధాలను ఉంచినట్లు భోగట్టా. ఈ గోదాములను కూడా ఈ బృందాలు పరిశీలించాయి. యూఎస్ డ్రగ్ బృంద అధికారి అక్తర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నట్లు సమాచారం.

పేకాట రాయుళ్ల అరెస్టు



పేకాడుతున్న వారిని పట్టుకున్న ఎస్‌ఐ, సిబ్బంది

నాతవరం: పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,350 నగదు స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. పెదగొలుగొండపేట గ్రామంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడిచేసినట్టు చెప్పారు.

దసరాలోగా డీఏ బకాయిలు చెల్లించాలి

యూటీఎఫ్ రణభేరి ముగింపు సభలో వక్తలు



సభలో మాట్లాడుతున్న రెడ్డి మోహన్‌రావు

అనకాపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని, కొత్త పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని, బకాయిపడ్డ డీఏలను దసరాలోపు చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకుడు రెడ్డి మోహన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా రణభేరి ముగింపు సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. 12వ పీఆర్సీ కమీషన్ వెంటనే నియమించాలని, అంతవరకూ ఉద్యోగులకు 29శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేసి విజయదశమికి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ను అనుసరించి, 2003 డీఎస్సీలో సెలెక్ట్ అయిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. ఈ సమస్యలపై స్పందించక పోతే ఈ నెల 25న గుంటూరులో భారీ బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వానికి అల్టిమేటం ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, గౌరవాధ్యక్షుడు పి. వెంకట్రావు, సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, సీనియర్ నాయకులు జి.ఎస్. ప్రకాష్, శేషుకుమార్, రమేష్ రావు, ఎల్లయ్య బాబు, వెంకటప్పారావు, హైమ, శరగడం జగ్గారావు, ఎస్.ఎస్. నాగమణి, గంజి నాగేశ్వరరావు, రమేష్, కృష్ణ, నారాయణ, అప్పారావు, రవికుమార్, ఆనంద్, కామరాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు పరిశీలన



విజయరామరాజుపేట తాచేరు వంతెనను పరిశీలిస్తున్న విజయశ్రీ

బుచ్చెయ్యపేట: మండలంలోని బీఎన్ రోడ్డును, విజయరామరాజుపేట, వడ్డాదిలో కూలిన వంతెనలను, దెబ్బతిన్న డైవర్షన్ రోడ్లను రాష్ట్ర రహదారులు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ వి.కె. విజయశ్రీ శుక్రవారం పరిశీలించారు. కూలిన వంతెనలు, దెబ్బతిన్న డైవర్షన్ రోడ్లు, గోతుల పడిన బీఎన్ రోడ్డును బాగు చేసి, ప్రజలకు ప్రయాణ సదుపాయం కల్పించాలని పలువురు నాయకులు ఆమెను కోరారు. బీఎన్ రోడ్డు పనులు త్వరగతిన చేస్తామని ఆమె హామీ ఇవ్వకపోవడంతో స్థానిక నేతలు నిరాశ చెందారు. ఈఈ శాంబశివరావు, డీఈలు ప్రభు, విద్యాసాగర్, జేఈలు సత్య ప్రసాద్, సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి ఆశయ సాధనకు కృషి చేయాలి

పొట్టి శ్రీరాములు మేనల్లుడు గునుపూడి వెంకట సత్యనారాయణ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న వెంకట సత్యనారాయణ

అనకాపల్లి: నేటి యువత అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన మేనల్లుడు గునుపూడి వెంకట సత్యనారాయణ కోరారు. స్థానిక మెయిన్‌రోడ్డులో అమరజీవి పొట్టి శ్రీరాములు భవనం 24వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు శ్రీరాములు ప్రాణత్యాగం గురించి వివరించారు. అనంతరం పట్టణంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, మహిళా కళాశాల విద్యార్థినులకు 3 వేలు నోట్ పుస్తకాలను, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.వి.ఎం.నాగజ్యోతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పిరాట్ల నరసింహామూర్తి, సభ్యులు కాండ్రేగుల దుర్గాప్రసాద్‌రావు, కాండ్రేగుల సత్యనారాయణ, గంగుపాము నాగేశ్వరరావు, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు లావణ్య, కార్యదర్శి ఉమ, కో ఆర్డినేటర్ మంజు భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

20న ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పోటీలకు సిద్ధంగా క్రీడా మైదానం

అనకాపల్లి: స్థానిక ఏఎంఏఎల్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 20న ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు అథ్లెటిక్ పోటీలను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కళాశాలల నుంచి 19 జట్లతో 200 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు.

రూ. 6,400 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలి

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు బకాయిపడ్డ రూ.6,400 కోట్లు తక్షణమే కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే విధానాన్ని విడనాడాలన్నారు. రాష్ట్ర సభాపతి అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాకవరపాలెం మెడికల్ కళాశాలను పూర్తిస్థాయిలో ప్రభుత్వమే నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన తర్వాత గాలికి వదిలేసిందన్నారు. విద్యార్థులు సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎ. జగదీష్ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి, జిల్లా కార్యదర్శి రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో కమీషన్ల చిచ్చు

- రూ.7 కోట్ల కొనుగోళ్లలో రూ.42 లక్షల కమీషన్
- సొమ్ము పంపకాల్లో తేడాతో అధికారుల్లో విభేదాలు
- మరోసారి వార్తల్లో నిలిచిన ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రి



మహారాణిపేట: ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ ఇటీవల కాలంలో తరచూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా అవినీతి ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఆసుపత్రిలో ఉన్నతాధికారుల మధ్య కమీషన్ల పంపకాల విషయంలో తలెత్తిన విభేదాలు, కుమ్ములాటలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇటు కేజీహెచ్‌లో.. అటు వైద్య ఆరోగ్య శాఖలో పంపకాల బాగోతం హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవల ఆసుపత్రిలో ఆక్సిజన్, సర్జికల్ పరికరాలు, మందుల కొనుగోలు కోసం సుమారు రూ. 7 కోట్లు వెచ్చించారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి దాదాపు రూ.42 లక్షలు కమీషన్‌గా చేతులు మారినట్లు సమాచారం. అయితే, ఈ కమీషన్ డబ్బు పంపకాల్లో తేడాలు రావడంతో పరిపాలన విభాగాల్లోని అధికారుల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. వాటాల విషయంలో తలెత్తిన వివాదం ఎంతగా ముదిరిందంటే, ఒక అధికారి చాంబర్‌లో చెక్కులు, కాగితాలు విసిరికొట్టే స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. వివిధ విభాగాల గుమస్తాలు, అధికారుల నుంచి ఉన్నత స్థాయి వరకు పంపకాలు జరిగాయని సమాచారం. కేవలం ఈ ఒక్క సంఘటనే కాదు.. కేజీహెచ్‌లో అవినీతి వ్యవస్థీకృతంగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అమ్యామ్యాల ముట్టజెప్పకపోతే కొనుగోళ్లు, టెండర్లు, ఇతర పనులకు సంబంధించిన ఫైళ్లు ముందుకు కదలవని, వాటిని ఏదో ఒక మూలన పడేస్తున్నారని సిబ్బందే గుసగుసలాడుకుంటున్నారు. ప్రతి పనికి డబ్బులు లంచంగా ఇవ్వనిదే జరగని పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కమీషన్ల భాగోతం బయటకు పొక్కడంతో.. నీ వల్లే బయటపడింది అంటూ అధికారులు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నట్లు సమాచారం. కేజీహెచ్‌లో ఈ అవినీతి జాడ్యం ముదరకముందే కలెక్టర్ జోక్యం చేసుకుని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తిమిరాం వారపు సంతకు దసరా శోభ

- వారపు సంతకు భారీగా వచ్చిన పొట్టేళ్లు, మేకపోతులు
- అమాంతంగా పెరిగిన ధరలు
- నాటు కోళ్ల ధరలకు రెక్కలు
- కొనుగోలుదారులతో కిటకిటలాడిన వారపు సంత ప్రాంగణం



తిమిరాం వారపు సంతకు విక్రయానికి తీసుకు వచ్చిన కొమ్ములు తిరిగిన పొట్టేళ్లు



క్రయ, విక్రయదారులతో కిటకిటలాడిన తిమిరాం వారపు సంత ప్రాంగణం

దేవరాపల్లి: మండలంలోని తిమిరాంలో శుక్రవారం జరిగిన వారపు సంత దసరా శోభను సంతరించుకుంది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పొట్టేళ్లు, మేకపోతులు, నాటుకోళ్లకు యమ గిరాకీ ఏర్పడింది. దసరాకు ముందు వచ్చే సంత కావడంతో జిల్లా నలుమూలల నుంచి గొర్రెపోతులు, మేక పోతులతో పాటు నాటు కోళ్లను విక్రయించేందుకు రైతులు అధిక సంఖ్యలో తీసుకువచ్చారు. వీటిని కొనుగోలు చేసేందుకు విశాఖపట్నం, విజయనగరం, పాడేరు తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు, ప్రజలు తరలివచ్చారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మోటార్లు, మోటారు వాహనాలకు, యంత్ర పరికరాలకు పొట్టేళ్లు, నాటు కోళ్లను మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ.. ఈ నేపథ్యంలోనే ఇక్కడి వారపు సంతకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో కొనుగోలుదారులు రావడంతో వీటి ధరలు అమాంతం పెరిగాయి. ఇక్కడి వారపు సంతలో తక్కువ ధరకు ఆరోగ్యకరమైన పొట్టేళ్లు, మేకపోతులు, నాటుకోళ్లు లభిస్తాయన్న అభిప్రాయంతో సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తారు.



వారపు సంతకు భారీగా వచ్చిన నాటు కోళ్లు

10 కిలోల బరువు గల పొట్టేళ్లు రూ. 25 వేలు నుంచి రూ. 35 వేల వరకు ధర పలికాయి. సాధారణ రోజుల్లో రూ. 1500 నుంచి రూ. 2000 ధర పలికే కోళ్లకు రూ. 3000 నుంచి రూ. 5 వేలు వరకు ధరలు పెరగాయి.

ఏయూ అంతర్ కళాశాల క్రీడా పోటీలు ప్రారంభం



అంతర్ కళాశాల క్రీడాకారులతో వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఏయూ అంతర్ కళాశాల క్రీడా పోటీల్లో భాగంగా పురుషుల కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఏయూ జిమ్నాజియం కబడ్డీ మ్యాట్‌పై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ గుర్తింపు పొందిన కళాశాలల కబడ్డీ క్రీడాకారులు పాల్గొనడంపై అభినందనలు తెలిపారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏయూలోని క్రీడా మైదానాలను సింథటిక్ మైదానాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని సూచించారు. అలాగే, ఈ సంవత్సరం నుంచి ఇంటర్ కాలేజియేట్ క్రీడల్లో పాల్గొనే వారికి భోజన సదుపాయంతో పాటు, ఇతర యూనివర్సిటీలకు వెళ్లే క్రీడాకారుల డీఏను పెంచినట్లు వివరించారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎస్. విజయమోహన్ మాట్లాడుతూ వివిధ జిల్లాలకు చెందిన అనుబంధ కళాశాలల నుంచి 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఇందులో సుమారు 35 జట్లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ. పల్లవి, ఐపీఈ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ జి. వెంకటేశ్వరరావు, పీడీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

25న సత్యమాంబ ఉత్సవం

కశింకోట: స్థానిక సత్యనగర్‌లో ప్రసిద్ధి చెందిన సత్యమాంబ ఉత్సవాన్ని ఈ నెల 25న ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎదిరి రమణ, కార్యదర్శి కట్టా దర్గా, కోశాధికారి భీశెట్టి నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా అదే రోజు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, ఊరేగింపు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవా కార్యక్రమంలో భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో గౌరీపరమేశ్వరుల 208వ ఊంజల్ సేవా కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాల కృష్ణశర్మ, శేష వేదమంత్రాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శరగడం మహాలక్ష్మినాయుడు ఉమాలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీ గీత మహిళా మండలి, సత్తెమ్మతల్లి దేవస్థానం మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృత వర్షిణి ప్రతినిధి పెంతకం శెట్టి సుజాత ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల ప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నసమారాధన

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఏర్పాటైన సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధి బుద్ధ భూలోకనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

దస్తావేజు లేఖర్ల నిరసన



నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలను విరమించుకోవాలని అనకాపల్లి దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం ఆవరణలో పెన్ డౌన్ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్లు మాట్లాడుతూ ఇటీవల ప్రవేశ పెట్టిన ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల దస్తావేజు తయారీ అనేది జటిలమవుతూ తీవ్ర జాప్యానికి ప్రజలు గురవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు శేషు, గున్నాజీ, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 50 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,630	4,930
రెండో రకం	3,750	3,750
మూడోరకం	--	--

అనకాపల్లి సినిమాలు

రాజా	: భద్రకాళి
సత్యనారాయణ స్క్రీన్-1	: కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: బ్యూటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-17, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 339 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని (08924-223595) సంప్రదించవచ్చు.

నెలల తరబడి..

- ముందుకు సాగని నాడు-నేడు పనులు
- నిధులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- పాఠశాలల్లో నిలిచిన భవన నిర్మాణాలు
- కొన్నిచోట్ల మరమ్మతులు పూర్తికాక ఇబ్బందులు



తరగతి గదుల్లో అసంపూర్తిగా వదిలేసిన విద్యుత్ లైన్లు

తుమ్మపాల:

పేద విద్యార్థులకు సర్కార్ విద్యను దూరం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభమైన నాడు - నేడు పనులను ఇంతవరకూ పూర్తి చేయలేదు. పైగా భవన నిర్మాణాలకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దాంతో ఆయా పాఠశాలల్లో నిర్మాణ సామగ్రి చెల్లాచెదురుగా పడి నిరుపయోగంగా మారింది. కొన్ని పాఠశాలల్లో విద్యుత్, ఫ్లోర్‌పై టైల్స్, గోడలకు ప్లాస్టింగ్‌లు పూర్తి చేసి సున్నాలు వేయకుండా మధ్యలోనే వదిలేయడంతో గత్యంతరం లేక ఉపాధ్యాయులు అక్కడే తరగతులు నిర్వహిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మారిన పాఠశాలల రూపురేఖలు....

దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా శిథిలమైన భవనాలలో కొనసాగుతున్న పాఠశాలలను గత **వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకంతో నవశకానికి శ్రీకారం చుట్టారు. మారుమూల గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధికి సైతం లక్షల్లో నిధులు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారు.** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పాఠశాలల స్థితిగతులు మారిపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మౌలిక సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యా విధానాన్ని, ఇంగ్లిషు భాషలో బోధన కూడా తీసుకురావడంతో విద్యార్థుల చక్కని నైపుణ్యం పొందుతున్నారు.

ఎన్నికల్లో నిలిచిన పనులు

మండలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు - నేడు మొదటి విడతగా 42 పాఠశాలకు రూ.11.21 కోట్లతో నూతన భవనాలు నిర్మించి మౌలిక సౌకర్యాల కల్పనతో వాటి రూపురేఖలే మార్చేశారు. రెండో విడతగా మరో రూ.15.20 కోట్లతో 43 పాఠశాల అభివృద్ధికి నిధులు వెచ్చించి పనులు ప్రారంభించారు. మొదటి విడత పూర్తయినప్పటికి రెండో విడత దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆగిన పనులు **తదుపరి ప్రభుత్వం మారడంతో శాశ్వతంగా నిలిచిపోయాయి. పాఠశాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా నిలిపివేసింది. ప్రస్తుతం ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి.**

రెండో విడత పనులకు బిల్లుల నిలిపివేత

మండలంలో రెండో విడత నాడు-నేడు పనుల్లో భాగంగా రూ.100 కోట్లు పైబడి మార్టూరు, కొండుపాలెం, తుమ్మపాల, తారక రామా కాలనీ పాఠశాలలకు, రూ.50 కోట్ల పైబడి సిహెచ్.ఎన్.అగ్రహారం, దిబ్బపాలెం, కొండ కొప్పాక, మామిడిపాలెం, మర్రిపాలెం, రూ.50 కోట్ల దిగువన మరికొన్ని పాఠశాలలకు నిధులు వెచ్చించారు. వీటిలో దాదాపు అన్ని పాఠశాలల్లో 80 శాతం పనులు పూర్తయినప్పటికి సగానికి పైగా బిల్లులు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో నేటికి పనులు పూర్తి కాలేదు. భవనాలు పూర్తవక విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు లేక విద్యార్థులందరినీ ఒక గదిలో ఉంచి తరగతులు నిర్వహిస్తున్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో రాణించాలి



వృత్తి విద్యా కోర్సు విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం స్వర్ణకుమారి



టూర్‌లో కుట్టు శిక్షణ గురించి తెలుసుకుంటున్న బాలికలు

కశింకోట: విద్యార్థులు చదువుతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో అపెరెల్ అండ్ మేడ్ అప్స్ వృత్తి విద్యా కోర్సు అభ్యసిస్తున్న 9, 10 తరగతుల బాలికలు ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా శుక్రవారం లెర్నట్ స్కిల్స్ వారి సహకారంతో అనకాపల్లిలో వస్త్ర తయారీలో వివిధ ప్రక్రియలపై అవగాహన కల్పించారు. టెక్స్‌టైల్స్ విభాగంలో హేండ్లూమ్స్, స్వీయింగ్ మిషన్, డయింగ్ మిషన్ల పనితీరును, వాటి ఉపయోగాలను ఈ సందర్భంగా వివరించారు. ఈ టూర్‌కు వెళ్లే ముందు పాఠశాలలో బాలికలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులు భవిష్యత్‌కు సోపానాలుగా నిలుస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పల్లె విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి ఎంపిక చేసిన పాఠశాలల్లో సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను నిర్వహిస్తోందన్నారు. లెర్నెట్ స్కిల్స్ సమన్వయకర్త కె. రమేష్ ప్రోత్సాహంతో నిర్వహించిన కార్యక్రమంలో వృత్తి విద్యా కోర్సు ఉపాధ్యాయిని ఎం. స్టెల్లా నిఖిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధర్నాకు తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు



ధర్నాకు వెళ్తున్న శోభా హైమావతి, ఈర్లె అనురాధ, దంతులూరి దిలీప్‌కుమార్, మలసాల కుమార్‌రాజా, తదితరులు

అనకాపల్లి: పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను అందించాలని దృఢ సంకల్పంతో మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తోంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకురాలు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, పార్టీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ అధ్యక్షురాలు ఈర్లె అనురాధల ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి మాకవరపాలెంలో మెడికల్ కళాశాల వద్ద ధర్నా చేపట్టేందుకు శుక్రవారం భారీఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. తరలివెళ్లిన వారిలో పార్టీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహం, జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు దండ సిద్ధార్థ, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, కె.ఎం. నాయుడు, కొణతాల మురళీకృష్ణ, వేగి త్రినాథ్, నీటిపల్లి లక్ష్మీ, లక్ష్మీ తదితరులు ఉన్నారు.

బకాయి జీతాల కోసం ఎండీఎం కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులకు బకాయిపడ్డ మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని సిటు మండల నాయకులు కె.ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో ఎండీఎం కార్మికుల పెండింగ్ వేతనాల కోసం శుక్రవారం పాఠశాలలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఎండీఎం కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు, బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కనీస వేతనంగా నెలకు రూ.10 వేలు చెల్లిస్తుందని ఆశించినా ఫలితం కనిపించలేదన్నారు. ఎండీఎం అమలు చేసి 20 ఏళ్ల గడుస్తున్నా కార్మికుల వేతనాలు గొర్రె తోక బెత్తెడు అన్న చందంగానే ఉందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కార్మికుల సమస్యలు కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్మికులకు హెల్త్‌కార్డులు, యూనిఫాం, గుర్తింపు కార్డుల్ని ఇంతవరకు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కె.లక్ష్మి, సత్యవతి, రత్నకుమారి, పైడితల్లి, నూకరత్నం, లక్ష్మి, అనిత, పార్వతమ్మ, దేవి, వెంకటలక్ష్మి, రత్నం పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేసినా మళ్లీ గుంతలే..

- సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

అనకాపల్లి: గతేడాది మార్చిలో రూ. 8.8 కోట్లతో 521 కిలోమీటర్ల మేర రోడ్లకు మరమ్మతులు చేసినా, ఇటీవల వర్షాలతో మళ్లీ గుంతలు, గొయ్యిలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితిలో వాహనదారులు భయంభయంగా ప్రయాణం చేస్తున్నారని వాపోయారు. జిల్లాలో 1100 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. నాణ్యతా లోపం వల్ల రహదారులు పాడైపోయినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా వేసిన 229 కిలోమీటర్ల రోడ్లు కొద్ది కాలంలోనే మరమ్మతులకు గురైనట్లు పేర్కొన్నారు. బుచ్చెయ్యపేట మండలంలో తాచేరు నదిపై వంతెన కొట్టుకుపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. రోడ్ల మధ్యలో పెద్ద గోతులు పడడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలు, కార్మికులు, రైతులు, చిరు వ్యాపారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణానికి అత్యవసర వైద్య సేవలు కోసం వచ్చే రోగులు ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలకు రోడ్లు లేక పదుల కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు.

తహసీల్దారును నియమించాలని ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

అనకాపల్లి: జిల్లా కేంద్రమైన అనకాపల్లి రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ను తక్షణమే నియమించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శుక్రవారం నివాళులర్పించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి నాయకులు ఒత్తిడి కారణంగా అనకాపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహించేందుకు భయపడుతున్నారన్నారు. అధికారులపై ప్రజా ప్రతినిధులను ఒత్తిడి చేయడం మానుకోవాలని, లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు భువన



భువనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుహాసిని, ఏటీపీ చంద్రకళ

పరవాడ: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి తానాం మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల బాలికల కళాశాలకు చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఆర్.భువన ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంవైఎస్ సుహాసిని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు భువనను ఆదర్శంగా తీసుకుని, క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా భువనను ప్రిన్సిపాల్‌తో కలిసి ఏటీపీ పి.చంద్రకళ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బలిఘట్టం విద్యార్థిని



సర్వసిద్ధి హిమబిందు

నర్సీపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భీమిలి లో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి బేస్ బాల్ అండర్ 14 బాలికల విభాగం పోటీల్లో బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సర్వసిద్ధి హిమబిందు సత్తా చాటింది. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. పాఠశాలకు పేరు తీసుకువచ్చిన హిమబిందు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వరరావును హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థుల వైద్య పరీక్షలకు సంచార వాహనం

ప్రారంభించిన డీఎంహెచ్‌వో



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

అనకాపల్లి: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న 0-18 సంవత్సరాల విద్యార్థుల వైద్య పరీక్షల కోసం డీఎంహెచ్‌వో ఎం.హైమావతి శుక్రవారం సంచార వాహనాన్ని ప్రారంభించారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షల కోసం పిల్లలను ఆస్పత్రులకు తీసుకువెళ్లి తీసుకువచ్చేందుకు ఈ వాహనాన్ని వినియోగిస్తారని ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె చెప్పారు. బాలల్లో డిఫెక్ట్స్, డిసీజెస్, డెఫిషియన్సీ, డిలేస్ వల్ల కలిగే అస్వస్థతలను దూరం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కె.వి.జ్యోతి, వైద్యులు చంద్రశేఖర్‌దేవ్, జె.ప్రశాంతి, ఎస్తేర్ రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సీడీపీవో ప్రభావతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలింతలు, కిశోర బాలికలు, కార్యకర్తలు

కశింకోట: ఆరోగ్యానికి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి కోరారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక బాలికల పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ప్రాధాన్యం, పిల్లల సంరక్షణపై తల్లులు, బాలికలు, బాలింతలకు అవగాహన కలిగించారు. పిల్లలకు ఏడో నెల నుంచి మూడేళ్ల వరకు రోజూ 8 సార్లు వరకు ఆహారాన్ని దఫదఫాలుగా అందివ్వాలన్నారు. ఊబకాయం రాకుండా ఆహారం తయారీలో నూనె వినియోగం తగ్గించాలన్నారు. బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల పిల్లలకు పాల ద్వారా పోషక విలువలు అందుతాయన్నారు. కిశోర బాలికలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. పిల్లలకు చదువుతోపాటు మంచి అలవాట్లను నేర్పించాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు ఎటువంటి ఆహారం ఎంత మేరకు అందివ్వాలనే విషయమై వివరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు సంతోషి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల కంటే అన్నదానం మిన్న



వేల్పులవీధి రామాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న వాసవి స్వయం సేవా ట్రస్ట్ సభ్యులు

అనకాపల్లి: అన్ని దానాల కంటే అన్నదానం ఎంతో గొప్పదని, పేదలకు తమవంతు సహాయం చేయడంతో ఆత్మసంతృప్తి కలుగుతుందని వాసవీ స్వయం సేవా ట్రస్ట్ చైర్మన్ బత్తుల గణపతి, కార్యదర్శి పోకూరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక వేల్పులవీధి రామాలయం వద్ద మహాలయ పక్షాలు పురస్కరించుకుని వాసవీ స్వయం సేవా ట్రస్ట్ సభ్యులు నిరుపేదలకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ రహదారిలో రోజూ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మహాలయ పక్షాలు పురస్కరించుకుని 15 రోజుల నుంచి వేల్పులవీధి రామాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 21న మహాలయ అమావాస్య పురస్కరించుకుని వేల్పులవీధి సాయిబాబా ఆలయం వద్ద 500 మందికి ఉచిత అన్నదానం, వస్త్రదానం, పండ్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు జి.లావణ్య, ఎం.ఉమ, ఎం.మంజు భార్గవి, శ్రీదేవి, రేవతి, రామాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 36 అడుగుల వినాయకునికి నిమజ్జనం





36 అడుగుల భారీ గణపతి , వేలం పాటకు సిద్ధంగా 59 కేజీల లడ్డూ

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి విస్టార్ గైస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36 అడుగుల వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు గర్రెడ్డి నూకరాజు, మెండి శ్రీను, ఉగ్గిన నరేష్, వాకడ మదన్, బొండా పవన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఫైర్ ఇంజన్ సహాయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుపు మహోత్సవాన్ని పురస్కరించుకుని 59 కేజీల లడ్డూ వేలం పాటను అదే రోజు సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తామన్నారు.

యూరియా లేక రైతుల ఇక్కట్లు



కూండ్రం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం ఎగబడిన రైతులు

అనకాపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో యూరియాను సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమయింది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవడంతో నాట్లు ఆలస్యంగా వేశారు. ప్రస్తుతం వరి పైరుకు యూరియా దొరకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులు రైతులకు సకాలంలో యూరియా అందించేవారు. ఐదేళ్ల పాలనలో రైతులు ఏనాడూ యూరియా కోసం ఇబ్బంది పడలేదు. కూటమి పాలనలో పీఏసీఎస్‌లు, పంచాయతీ పరిధిలో యూరియాను రైతులకు సరఫరా చేయడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది రైతులు ఆర్‌బీకే, వ్యవసాయ కేంద్రాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. శుక్రవారం మండలంలో కూండ్రంలో యూరియా కోసం అక్కడ రైతులు ఎగబడ్డారు. 295 బస్తాల యూరియా కోసం 460 మంది రైతులు రావడంతో మిగిలిన వారికి లేక నిరాశతో వెనుదిరిగారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఎన్నిక



నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి టౌన్: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా టి. వెంకటరమణ ఎన్నికయ్యారు. పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. గౌరవాధ్యక్షులుగా కె. రాంబాబు, ఎస్.వి. పద్మావతి, ప్రధాన కార్యదర్శిగా ఎన్. శ్రీనుబాబు, ఆర్థిక కార్యదర్శిగా ఎం.వి. నూకేష, మహిళా అధ్యక్షురాలిగా ఎం. ఉమామహేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా ఎస్.టి.బి.పి. దేవి, అసోసియేట్ అధ్యక్షులుగా పి.ఎస్.బి. సత్యనారాయణ(జబర్దస్త్ సత్తిపండు), ఎం. ఉమామహేశ్వరావు, జె. రమేష్, పి. రమాదేవి, ఉపాధ్యక్షులుగా కె.రాం ప్రసాద్, బి. మంగపతి, ఎ. ఈశ్వరరావు, జి. తులసి, అదనపు ప్రధాన కార్యదర్శులుగా ఎస్. వెంకట్రావు, జి. చక్రవర్తి, ఎస్. అనసూయ, ఎం. సుశీల, జిల్లా కౌన్సిలర్లుగా కె. గోవింద్, కృష్ణమోహన్, సిహెచ్. లక్ష్మణ్, ఎన్. రమాదేవి ఎన్నికయ్యారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న గొర్రెల, మేకల పెంపకందారులు

మాడుగుల రూరల్ : ఎం.కృష్ణాపురంలో గొర్రెలు, మేకల పెంపకందారుల కుటుంబానికి చెందిన కోళ్ళ వరహాలనాయుడుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం సభ్యులు శుక్రవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీవాల పెంపకం దారుల రక్షణకు చట్టం చేయాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేయాలని కోరారు.